
# రవి



పల్లవి గారి విశ్రాంతి పడక కుర్చీలో కిటికీ ప్రక్కగా కూర్చుని, ముసి ముసిగా నవ్వు కుంటూ ఏదో ఉత్తరం చదువుకుంటున్నాడు— రవి.

"మధ్యాహ్నం వచ్చిన ఉత్తరమేనా?" అడిగింది, వసంతి.

"అవున్నా. సుజాత వ్రాసింది."

వసంతి మరేమీ అడగలేదు. కుర్చీని వరండా

తుర్లపాటి కృష్ణమూర్తి

లోకి లాక్కుని స్నేహితునికి దూరంగా కూర్చు న్నాడు ఆలోచించుకుంటూ.

ఇద్దరూ ఆ యింట్లో కొచ్చి రెండు సంవత్సరాలయింది. అక్కడి కొచ్చేముందు ఒకరి ముఖం ఒకరికితెలియదు. పరిచయం స్నేహంగామారింది. రవి మహంతిని ఎంతగానో ప్రేమిస్తాడు. నిర్మలమైన హృదయంతో మహంతికి అన్ని విషయాలూ చెప్తేస్తూ ఉంటాడు. తను ప్రేమించిన అమ్మాయిని గురించి రవి చెపుతూంటే—మహంతి మొహం దాటేసేవాడు. వినలేకపోయేవాడు. తనకూ ఒక స్నేహితురాలు లేదేమా అని విచారించేవాడు. రవి అతడి నెంత గాఢంగా ప్రేమిస్తూంటే అంత దూరం వెళ్ళిపోసాగాడు, మహంతి.

మహంతి అందవికారుడు. లోకంలోని అనాకారం అంతా అతనిలోనే ఉందా అనిపిస్తుంది అతణ్ణి చూడగానే. అతనిది నిగూఢమైన ఆలోచన. తన గురించి గానీ, తన ఆశయాల గురించి గానీ ఎన్నడూ ఎవరితోనూ చెప్పినట్లు రవికి తెలియదు. అస లతనికి ఆశయాలనేవి ఉన్నాయో లేదో కూడా అనుమానమే. రవికూడా అనాకారుడే. కాని, మహంతిలా నోరు మూసుకు కూర్చోడు. ఎప్పుడూ ఏదో ఒకటి వాగేస్తూనే ఉంటాడు. నవ్వుతూ పేలుతూ మాట్లాడుతాడు, విచారం అనేది ఎరగనట్టు. మనస్తత్వ శాస్త్రం గురించి చాలా చదివా నంటాడు. అమ్మాయిల తత్త్వం ఇట్టే అర్థం చేసుకోవచ్చు నంటాడు. అందువల్లనే సుజాతతో తన కలం స్నేహం ప్రణయంగా మారిందంటాడు. సంఘం, వ్యక్తి, అవినాభావ సంబంధాలు, ఊహా ప్రపంచం—ఇవే అతని ఉపన్యాస ధోరణికి సహకరిస్తూ ఉంటాయి. కలం విషయంలో రవి సవ్యసాచి. ఏ క్షణంలోనైనా తను గొప్ప రచయితనై పోగలననే ధీమాతో మాట్లాడుతాడు. అడపా తడపా అతని రచనలు వార పత్రికల్లో పడుతూ ఉంటాయి. కమ్మగా పాడతాడు. అంతకుమించి కమ్మటి కబుర్లు చెప్తాడు. ఇంతకన్నా ఏం కావాలి అమ్మాయిలను ఆకర్షించడానికి? అనాకారుడైనప్పటికీ అమ్మాయిలు అతనితో మాట్లాడ్డానికి ఉవ్విళ్ళూరుతారు. అతని వాక్కులో ఆ ఆకర్షణ శక్తి ఉంది.

ఒకసారి కాలేజీ పాటల పోటీలో మొదటి బహుమతి పొందాడు. ఇంకోసారి వక్తృత్వపు పోటీలో కాలేజీ విద్యార్థు లందరిలోకీ ప్రథముడుగా నిల్చున్నాడు. మరొకసారి అంతర్విశ్వ విద్యాలయ విద్యార్థి సమ్మేళన సభల్లో గాయకుడుగా ప్రథమ బహుమతి తీసుకున్నాడు. ఇలా ఒకటేమిటి? ఎన్ని పోటీల్లోనో అగ్రతాంబూలం అందుకున్నాడు. 'అందుకే కామోసు—ఆ సుజాత యితణ్ణి ప్రేమించింది' అనుకున్నాడు, మహంతి.

ఉత్తరం చదువుకుంటూ మురిసిపోతున్నాడు, రవి. ఏం వ్రాసిందో అడుగుదా మనుకున్నాడు మహంతి. 'ఛా—అతని ప్రియురాలు వ్రాసింది మన మెందుకు తెలుసుకోవాలి?' అనుకుని ఊరుకున్నాడు.

*సహజమైనా, వేరు అయినా సృష్టిలో లోపాలు కొల్లలు. అనేకమైన లోపా లను ప్రకృతి ఏదో ఒక విధంగా పూరిస్తూ ఉంటుంది. అందుకే మానవుడు యత్నించ పూనుకొనడం విపరీతాలకు దారితీస్తుంది. చిత్రమే, మరి!*

కాలేజీలో ప్రతి వ్యక్తికీతెలుసు, రవి ప్రణయం గురించి. అందరితోనూ అతనే చెప్పుకుంటాడు. ఆ అమ్మాయి ఫోటో కూడా కొంతమందికి చూపించాడు. తన ఫోటో కూడా పంపమందిట—కాని, తన కురూపి మొహాన్ని ఆమెకు చూపటం యిష్టంలేక పంపించలేదంటాడు. అతనికి సుజాత వ్రాసే ఉత్తరాలను అతని స్నేహితులు చాలామంది చదివారు. తనే కొంతమందికి చదివి వినిపించేవాడు. వాళ్ళు—అంత అందమైన అమ్మాయిని సంపాదించుకున్నందుకు అతణ్ణి అభినందిస్తూంటే, మహంతి చాలాసార్లు గమనించాడు. రవి ఎంతో ఉబ్బిపోయేవాడు, సంతోషంతో. అలా వాళ్ళచేత పొగిడించుకోవడానికి కాకపోతే, సుజాత విషయం అతను వాళ్ళతో ఎందుకు చెప్పాలి? కాని, తన కెందుకు లెమ్మని ఊరుకునేవాడు, మహంతి.

"ఒరే. మహంతీ! ఈసారి ఏం వ్రాసిందో తెలుసురా?" అన్నాడు రవి—ఉత్తరం చదువుకుంటూనే. మహంతి ఉలకలేదు; పలకలేదు.

"నా ఫోటో పంపకపోతే యిక ఊరుకోనంది. ఇంతకాలంగా తనతో స్నేహం చేస్తున్నా, తన హృదయాన్ని అవగతం చేసుకోలేకపోయానని ఆరోపించింది. నేను ఎంత కురూపినైనా ఫర్వాలేదు. హృదయ వైశాల్యం ఎక్కువగా వుంటే చాలట. పాపం! అప్పుడప్పుడు నాలాగే కవిత్వం వ్రాయా లనిపించి ప్రయత్నిస్తుందట. నా ఆశయాలూ ఆదర్శాలూ అన్నీ తు చ తప్పకుండా ఆమె వాటితో ఏకీభవిస్తున్నదట. ఇలా ఏమేమో వ్రాసిందిరా."

మహంతి వింటున్నాడో లేదో కూడా తెలుసుకోకుండా రవి మాట్లాడేస్తున్నాడు.

"క్రితంసారి నేను వ్రాసిన ఉత్తరంలో—'నేను అందవికారిని. నా మొహంచూసి నువ్వు దడుసుకుంటావు కూడాను. అందుకనే నా ఫోటో పంపించటం లేదని వ్రాశాలే. అందుకోసం—ఈ జవాబు వెంటనే వచ్చింది."

మహంతి కిక్కురు మనలేదు.

"ఒకసారి కవిత్వం వ్రాయడానికి ప్రయత్నిస్తూ అన్నదిరా: 'ఆకసంపైనున్న ఆ రవినైనా వదులుకుంటాను గాని, మిమ్మల్నిమటుకు వదులుకోబోను. మీ అమాయకత్వం చిందిపోయే మాటలు, మీ హృదయాన్ని విప్పిచెప్పే నగ్న సత్యాలు నన్నెంతో ఆకర్షించాయి. మీకు అసరా కావాలి. అందుకు నేను సిద్ధం. ఈ లోకంలో అనాకారులకు స్థానంలేదని ఎందుకు వాపోతారు? నేనున్నాను మీకోసం.


మనిషిలో కావలసింది అప్సరసల అందం కాదు—గంధర్వుల ఆకారం కూడా కాదు—ఒక మంచి హృదయం కావాలి. పై చర్మం ఒలిచి చూస్తే లోపల అందరికీ ఒక విధంగానే ఉంటాయి శరీర భాగాలు. నల్లటివారికి నల్ల హృదయం, తెల్లవారికి తెల్ల హృదయం—అంటూ భగవంతుడు ఏమీ భేదం చూపలేదు. మీ హృదయం చెప్పే మాటలవలన మిమ్మల్ని పూర్తిగా అర్థం చేసుకున్నాను. అరు నూరైనా సరే నేను మీ దాననే. ఇలా ఏమి టేమిటో వ్రాసిందిరా. నేను నల్లగా అందవిహీనంగా ఉన్నందుకుసానుభూతిచూపుతూ అందుకు బాధ పడవద్దని వ్రాసింది."

మహంతికి విసుగు పుట్టింది. కోపం వచ్చింది.

"రవీ! ఎందుకురా వాగుతావు పని లేనట్టు? ఏమీ తోచకపోతే ఆ శ్రీధర్‌గా డున్నాడుగా—వాడి దగ్గరి కెళ్ళు, నీ వాగుడు వాడితో అయితే సరిపోతుంది. ఇన్ని టీ నీళ్ళు పోయిస్తే రాత్రల్లా వింటాడు నువ్వు చెప్పే సొద" అన్నాడు కఠినంగా.

రవి చిన్నగా నవ్వుతూ, "సర్లే. అలాగే చేస్తా" నంటూ లేచి, వెళ్ళిపోయాడు. వీధి తలుపు తెరుచుకుని చీకట్లోకి వెళ్ళుతున్న రవిని చూసి మహంతి వికటంగా నవ్వుకున్నాడు.

ప్రక్కింట్లోని రేడియోలోంచి సన్నగా లతా మంగేష్కర్ గొంతు వినిపిస్తూంది. మహంతి విసుక్కున్నాడు—'కొంచెంసేపైనా నిశ్శబ్దంగా కూర్చోనీదు ఈ లోకం' కిటికీ తలుపులు మూసేశాడు.





నిరీక్షణం

చిత్రం—కాటూరి కృష్ణమూర్తి (నూతకర్త)

మర్నాడు కాలేజీలో అందరితోనూ చెప్పుకున్నాడు రవి—సుజాత క్రొత్తగా వ్రాసిన ఉత్తరం గురించి. అందరూ అతనికి అభినందనలు తెలియజేశారు, అంత మంచి అమ్మాయిని సంపాదించుకున్నందుకు. ఇదంతా దూరంనుంచి గమ

## రవి

నించి ప్రక్కదారమ్మట వెళ్ళిపోయాడు, మహంతి. సరాసరి ఇంటి కెళ్ళిపోయాడు.




గదిలోకెళ్ళేసరికి అతనికి పిచ్చియెత్తినట్లైంది. తనతో ఎవరూ మాట్లాడరు—ఏ అమ్మాయీ తనను పలకరించదు—ఎవ్వరికీ తనంటే సదభిప్రాయం లేదు. తనేం చేసుకున్నాడు, పాపం!? రవిగాడు చేసుకున్న పుణ్యమేమిటి? ఈ ఆలోచనలతో అతని మనస్సంతా వికలమైపోయింది.

నా అన్నవాళ్ళు లేరు తనకు. తన కాళ్ళమీద తను బ్రతుకుతూ బి. ఏ. ప్యాసైనాడు. యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసానికై చేరాడు. ఏవిధంగా చూసినా తను రవికన్నా తక్కువవాడేమీ కాదు. మరెందుకని తోటి విద్యార్థులంతా తనను విచిత్రంగా చూస్తారు? తనతో మాట్లాడడానికే భయపడతారు.

రవిలో ఉన్న ఆకర్షణ శక్తి—ఏదైనా కానీ, మహంతిలో లేదు. ఈ విషయం అతనికీ తెలుసు. కాని, మనిషికి ఆశ అనేది సహజగుణం. ఆ ఆశ మహంతిలో కొంచెం ఎక్కువ పాళ్ళల్లో ఉంది. ఆ ఆశ మానవుడి నాశనానికి ఒకప్పుడు దారి తీస్తుందని అతనికి తెలియకపోదు. ఈర్ష్యకు మరో పేరు మహంతి అనిపిస్తుంది, అతణ్ణి చూడగానే.

క్లాసు క్లాసంతా నవ్వుతూంటే అతను మొహం మాడ్చుకుని కూర్చుంటాడు. తనకు సంతోషం లేకపోగా ఎదుటివారు సంతోషిస్తూంటే చూసి ఓర్వలేడు. ఇదే ఈర్ష్య అంటారు. అటువంటి మహంతి రవి పొగడ్తల నందుకోవడం చూసి ఓర్వగలడా?

"మహంతీ! నీ కెన్ని రోజులుగానో ఒక విషయం చెప్పాలనుంది. చెప్పమంటావా?" అనడిగాడు రవి—కొన్ని రోజులక్రితం. తను మాట్లాడలేదు.

"ఆనందం అనేదానికి కొంతమంది పుట్టుకతోనే దూరమవుతారు. మనం ఎంత ప్రయత్నిస్తే అది అంత దూరంగా వెళ్ళిపోతుంది. విచారం అనేది ముంచుకొస్తుంది. ఒరేయ్, మహంతీ!

నువ్వెప్పుడూ యిలా మొద్దుగా కూర్చోవడం నా కిష్టంలేదు. ఆనందంగా వున్నట్లే నటించకూడదూ? లోపల విచారం వున్నా ఈ నటనే నీకు చాలా ఉపయోగపడుతుంది. కొన్ని రోజులకు నీకు నిజంగానే ఆనందం పొందుతున్నట్లు అనుభూతి కలుగుతుంది" అని చెప్పిన రవికేసి మహంతి ఘాటుగా చూశాడు.

"విచారం లేదే నాకు? దేనికోసం విచారిస్తాను నేను"—అన్నాడు ముక్తసరిగా. అది అతనికి అలవాటే. ఎప్పుడూ ఒకే ఒక మాటలో జవాబిచ్చేస్తాడు, ఎదుటి వ్యక్తి ఎంత పెద్ద ఉపన్యాసం ఇచ్చినా.

"నాకు తెలుసు, మహంతీ, నువ్వు పడుతున్న వ్యథ! నువ్వు ప్రయత్నించు. నీకు నీవే అయోగ్యుడి వనుకుంటే లోకమే నిన్ను మరింత జుగుప్సతో చూస్తుంది. ముందు నిన్ను నీవు ప్రేమించుకో. తర్వాత నీవు కోరుకున్నవారిని...."

అతనలా చెప్తూండగానే తనకు కోపం వచ్చే

సింది. అసందర్భమైన కోపం. "చాల్లేవోయ్—ఎవరి పద్ధతి వాళ్ళది. ఈ నటన నాకు చేతకాదు" అనేశాడు.

"అది కాదు, మహంతీ! నువ్వు నటన చెయ్యనక్కరలేదు. ఇదేమీ బ్రహ్మవిద్య కాదు. సంతోషంగా వున్నట్లు పైకి కనిపించడమే—"

"రవీ" అనరిచాడు తను. రవి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు, ఏదో బాధ పడుతూ. అనాటి సంఘటన మరిచిపోలేదు, మహంతి. క్రుళ్ళి క్రుళ్ళి ఏడ్చాడు. తన జీవితంలో ఇక వెలుగనేది ప్రవేశిస్తుందో లేదో అతనికి అనుమానమే.

గబుక్కున ఏదో జ్ఞాపకాని కొచ్చి మంచం మీంచి లేచాడు. వీధి తలుపులు గడియబెట్టి రవి గదిలో కెళ్ళాడు. రవి సూట్‌కేసులో ఉన్న ఫోటో ఆల్బమ్ తెరిచాడు. ఆ అమ్మాయి ఫోటో—రవి ప్రాణ సమానంగా ప్రేమించుకుంటున్న సుజాత ఫోటో—కన్పించింది. ఆమె బొమ్మను చూడడానికి మహంతి కిదే మొదలు.

ఆశ్చర్యపోయాడు. 'ఎంత అందంగా ఉంది' అనుకున్నాడు. ఆ బొమ్మను చూస్తూ పావు గంటసేపు కూర్చున్నాడు. 'కాకి ముక్కుకు దొండ పండు' అనుకుంటూ తిరిగి ఆలోచనల్లోకి జారిపోయాడు, మహంతి.

రవి తలుపు కొట్టాడు. తలుపుతీసి ఏమీ ఎరగనట్టు హాల్లో కెళ్ళిపోయాడు మహంతి. రవితో మాట్లాడలేకపోయాడు.

రవిని చూస్తూంటే ఎందుకో, ఏమిటో తెలియని ఆవేదన. వ్యథ చెందుతాడు అతణ్ణి చూస్తూ. మహంతిని నిలువెల్లా ఈర్ష్య దహించి వేస్తూంది. ఆ రాత్రంతా మెలకువగానే ఉన్నాడు.

మర్నాడు తలనొప్పిగా ఉందని చెప్పి కాలేజీకి పోలేదు. రవి వెళ్ళిపోగానే, పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు. రవి గదిలోకి నడిచాడు. అతని పెట్టెలో ఉన్న సుజాత వ్రాసిన ఉత్తరాలనుతీసి ఒక్కొక్కటిగా చదవడం ప్రారంభించాడు.

ఆ అమ్మాయి ఒక బీద కుటుంబంలో జన్మించిందట. ఎవ్వరూలేరు ఆమెకు. ఒంటరి జీవితం గడుపుతూంది. అక్కడా ఇక్కడా చందాలు ప్రోగు చేసుకుని చదువుకుంది. సెకండరీ గ్రేడు ట్రైనింగు ప్యాసై, పంతులమ్మ ఉద్యోగం చేస్తూంది. సర్వస్వతంత్రంగా జీవిస్తూ, తన ఆశయాలూ ఆదర్శాలూ విడమరిచి చెప్పింది రవితో. అతణ్ణి తన ప్రాణంతో సమానంగా ప్రేమిస్తున్నానన్నది.

ఇంకా ఏవేవో వ్రాసింది.

అన్నీ చదివాడు—మహంతి. తర్వాత—

ఒక రోజున రవి హోటల్లో కాఫీ త్రాగుతూ శ్రీధర్‌తో ఏమో చెప్పుతున్నాడు. మహంతికి ఆ సంభాషణ అస్పష్టంగా వినిపించింది.

"వెళ్తావా అయితే—" అనడుగుతున్నాడు శ్రీధర్.

"మరి—వెళ్ళక తప్పుతుందా! ఆమె అక్కడ చావు బ్రతుకుల్లో ఉంటే నేను వెళ్ళకుండా ఎట్లారా? నాకో నమ్మకం ఉంది—నేను వెళ్తే ఆమెకు తప్పకుండా నయమవుతుంది."

రవి స్నేహితులందరూ ఆమె జబ్బు పడినందుకు సానుభూతి చూపుతూ మాట్లాడారు.

"కాని, రవీ! నాకో అనుమానంరా. ఎన్నిసార్లు వ్రాసినా నువ్వు రావడం లేదని ఈ ఎత్తు ఎత్తిందేమో?"

"ఛా! ఆమె గురించి అంత నీచంగా ఆలోచించలేను. ఆమె స్వభావం నాకు పూర్తిగా అర్థమైందిగా—ఆమె అటువంటిది కాదు."

"వెళ్తే తొందరగా వచ్చేస్తావా?"

రవి చిరునవ్వు నవ్వాడు. జవాబివ్వలేదు.

"అవున్లే—వెళ్ళక వెళ్ళక ప్రేయసి దగ్గరికెళ్తే....."

మహంతి వినలేకపోయాడు.

రవి ఇంట్లో లేనప్పుడు సుజాత క్రొత్తగా వ్రాసిన ఉత్తరంతీసి చదివాడు మహంతి.

'ప్రియమైన రవికి,

నాలుగు రోజులనుంచీ నాకు ఒంట్లో బాగుండటంలేదు. నిన్ను ఒక్కసారి చూసి చచ్చిపోదామనిపిస్తూంది. నాకోసం వెంటనే రెక్కలు కట్టుకు రాలేవూ?

రవీ! నిజం చెపుతున్నాను. నేను ఇంక ఎన్నో రోజులు బ్రతక ననిపిస్తుంది. నిన్ను చూడాలనే తహ తహ రోజు రోజుకూ పెరిగిపోతూంది. ఏమంటావు? నాకోసం రావూ??

నీ రాకకోసం ఎదురు చూస్తూ.....

సుజాత.'

మహంతి కడుపులో బాంబు ప్రేలినట్లైంది. అవును— తనకు తట్టిన ఉపాయం ఖాయమైనదే. అయినా భయంకరమైనది. సుజాత తనకోసమే ఎదురు చూస్తుంది, తను రవిగా మారితే!! తనకోసం ఎదురుచూసే ఒక అమ్మాయి—తనకోసం బ్రతికే ఒక అందమైన అమ్మాయి—తను వెళ్ళకపోతే చచ్చిపోయే సుజాత. 'సుజాత నాది' అనుకున్నాడు వెర్రిగా. మర్నాడు సాయంత్రం—

నిద్రలేక ఎర్రబడ్డాయి మహంతి కళ్ళు. ఆలోచనలతో నుదురు వేడెక్కిపోయింది. కాలేజీకి వెళ్ళలేదు మూడు రోజులుగా. చింపిరి జుట్టు మొహంమీదకు విరుచుకుపడుతూంది. అనుక్షణం అతని కళ్ళల్లో మెదులుతూంది సుజాత విగ్రహం.

రవి ఇంటి కొచ్చాడు. ఆందోళనగా అడిగాడు:

"ఏమిటి మహంతీ! ఏమిటీ ఆకారం—ఎందుకూ?"

మహంతి తొందరగా మాట్లాడలేకపోయాడు. పది నిమిషాల అనంతరం, "మనస్సేమీ బాగాలేదు. చూడు—దూరంగా— ప్రశాంతంగా ఉండే ఆ కొండల్లోకివెళ్ళాలనిపిస్తూంది. వెళ్దాం. వస్తావా" అనడిగాడు, మహంతి. ఉత్తర క్షణంలో ఒప్పుకున్నాడు, రవి.

"మహంతీ! నీ ఆనందంకోసం నన్ను ఏం చెయ్యమన్నా చేస్తాను. నీ విచారమే పోవాలి గానీ—నే నేమైనా చేస్తాను. పద" అన్నాడు రవి.

ఇద్దరూ బయలుదేరారు. రెండు మైళ్ళు నడవగానే ఆ కొండలు దగ్గరి కొచ్చాయి. ఒకదాని మీద మరొకటి పేర్చినట్లున్న ఆ కొండలను చూస్తూ మహంతి దీర్ఘంగా ఆలోచించాడు.


## తరచుగా మూత్ర విసర్జన

చక్కెరతోగాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రం విసర్జించడం ప్రమాదకరమైన చిహ్నం. అది శరీర తత్వాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, రోజు రోజుకు రోగిని మృత్యు సమీపానికి తీసుకువస్తూంటుంది. ఆరంభంలో శారీరకంగా కానీ, మానసికంగాకానీ శ్రమపడడానికి అయిష్టత, నడుం నొప్పి, దృష్టి మాంద్యం, తొడలవద్ద తిమ్మిరి, సర్వసాధారణంగా బలహీనత మొదలైన లక్షణాలు కనబడుతూవుంటవి. ఈ లక్షణాలు గోచరించటంతోనే తగిన చికిత్స చేయకపోతే, వుత్తరోత్తరా అమితదాహం, ఆకలి, నోరు, గొంతు ఎండుకపోవుట, దురద, కాళ్లలో సంకటం, బరువు తగ్గటం, శరీరమంతా పొట్లు, కీళ్లవాతం, కళ్లపొర, టి. బి, కురుపులు, రాచపుండు, తదితర తీవ్రవ్యాధులకు గురికావలసి వస్తుంది. "వీనస్ చారం" బిళ్లలు వాడి వేలాది మంది శమనంపొంది మృత్యువాతపడకుండా తప్పించుకున్నారు. "వీనస్ చారం" బిళ్లలు ప్రాచీన యూనాని వైద్యసిద్ధాంతం ప్రకారం శాస్త్రీయంగా అరుదైన మూలికలతోను, వనస్పతుల సారములతోను, స్వాభావికమైన క్షారములతోను తయారుచేయబడ్డవి. ఈ చికిత్సమొదలుపెట్టిన రెండవ, లేదా మూడవ రోజునుంచే అమితదాహం మూత్రంలో చక్కెర తగ్గి, తరుచుగా మూత్రవిసర్జన చేయటం నిలిచిపోతుంది. కొద్దిరోజులలోనే మీకు సగానికి పైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ చారం" ఖర్చు తక్కువ. నిరపాయమయినది. తీసుకొనడం సులభం. ప్రత్యేక కఠినపథ్యాలుకానీ, ఉపవాసాలు చేయవలసిన అవసరంకానీ వుండవు. రోగులు పుష్టికోసంబలప్రవర్ధకమైన వివిధపదార్థములను భుజించవచ్చును. కోరినవారికి పూర్తివివరాలుకల సారస్వతం ఇంగ్లీషులో పంపబడును. 50 బిళ్లల ఖరీదు 6.75 న.పై. మాత్రమే. పోస్టేజి నిమిత్తము రూ. 1—6. న.పై. అదనము. (ఒకేసారి రెండు, అంతకు పైగా, సీసాలను తీసుకున్న పోస్టేజి వుచితం.) దొరకు చోటు :

**(Selling Agents):**
**Barrys Commercial Corporation (A.H.W.)**
**27|A Dhurumtollah Street,**
**Calcutta-13.**

కొండల మధ్యగా చిట్టడవు లున్నాయి.

"మహంతీ! ఈ అడివి లోపలకు వెళ్దామా?"

రవి కళ్ళల్లోకి చూశాడు మహంతి.

"ఊఁ పద" అన్నాడు.

"చీమలు దూరని చిట్టడవి—కాకులు దూరని కారడవి"—నెమ్మదిగా గొణుక్కున్నాడు మహంతి.

"అవున్నా. ఇక్కడ ఎంత ఘోరం జరిగినా లోకానికి తెలియదు. చూడు—ఎంత నిశ్శబ్దంగా ఉందో!!"

మహంతి మొహం త్రిప్పుకున్నాడు. ముళ్ళను తప్పించుకుంటూ జాగ్రత్తగా నడుస్తున్నాడు.

ఆ నిశ్శబ్దాన్ని పాడుచేయడం ఇష్టం లేక రవి మాట లాపేశాడు. అడవి పక్షులు చేస్తున్న వింత వింత అరుపులను వింటూ సాగిపోతున్నాడు. అతనికానందాన్నిస్తోందా ప్రశాంత వాతావరణం.

ఆ నిశ్శబ్దమే మహంతి బుర్రను ఆలోచనల్లో ముంచింది. ఆ ప్రదేశం అతనికి భయంకరంగా అనుపించింది. ఆలోచనలతో కళ్ళు చెదిరిపోతున్నాయి.

సుజాత బొమ్మ మెదిలింది అతని మనస్సులో.

అంతే.

రవి వెనక్కు తిరిగాడు. భయంగా చూశాడు. 'ఎందుక'న్నట్లుగా సంజ్ఞ చేశాడు, కళ్ళతో. కెవ్వున అరవాలనుకున్నాడు. కాని—

మహంతి చేతులు రవి మెడచుట్టూ బలంగా బిగుసుకున్నాయి.

రవి ఏదో చెప్పడానికి ప్రయత్నించాడు.

# రవి

మహంతిలో ఉన్న ఈర్ష్య వికటాట్టహాసం చేసింది.

రవి కళ్ళల్లోంచి కన్నీరు కారింది.

ఆ కన్నీరు మహంతి రాక్షస కార్యాన్ని ఆపలేకపోయింది.

మహంతి గుండెల్లోంచి ద్వేషం గుత్తులు గుత్తులుగా ఎగజిమ్మింది.

రవి నాలుక పైకొచ్చింది. కళ్ళుబికాయి.

అంతే—

రవి అస్తమించాడు. మహంతి రుమాలుతో మొహానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు. రవి శరీరాన్ని తుప్పల్లోకి లాగి, నాలుగు కొమ్మలు విరిచి దానిమీద వడేశాడు. ఆకులు చల్లాడు.

సూర్యాస్తమయం అయింది.

గబగబా అడివి దాటి ఇవతలి కొచ్చేశాడు. సముద్రపు ఒడ్డమ్మట చాలా దూరం నడిచి, ఊళ్ళోకొచ్చాడు, మహంతి.

ఆ రాత్రల్లా సుజాత బొమ్మ కెదురుగా కూర్చుని, ఆమె వ్రాసిన ఉత్తరాలన్నీ చదివి—ఆనందంగా నిద్రపోయాడు, మహంతి.

కాలేజీలో అందరూ—రవి, సుజాత దగ్గరి కెళ్ళాడని అనుకున్నారు. మహంతిని అడిగాడు, శ్రీధర్. 'అవు'నన్నాడు మహంతి.

ఆ రాత్రే రైల్లో బయలుదేరాడు, మహంతి.

సుజాత ఊరురాగానే సీయగా ముస్తాబై దిగాడు. సుజాతతో తను గడపబోయే రోజుల్లో తన 'పేరు రవి. తన ప్రవర్తనను కొంత మార్చుకోవా' లనుకున్నాడు. రవిలా మాట్లాడేందుకు ప్రయత్నం చేశాడు. కాని, అతని కేమీ సాధ్యం కాలేదు. అమెకు రవి ఎవరో, ఎలా ఉంటాడో తెలియదు గనుక తనను చూసి రవి గానే భ్రమిస్తుంది. కనుక—తనెట్లా ఉన్నా ఫర్వాలేదని సర్ది చెప్పుకున్నాడు తనకు తాను.

సుజాత అడ్రసు పట్టుకుని ఊళ్ళో కెళ్ళాడు. 'ఆనంద నిలయం' అనే ఆమెయింటిని గురించి నలుగుర్నీ కనుక్కున్నాడు. ఎవ్వరికీ ఆ యింటిని గురించే తెలియదన్నారు. అన ఆటువంటి అమ్మాయిని ఆ ఊళ్ళో చూసినట్లుగా ఎవ్వరూ చెప్పలేకపోయారు.

సుజాత అనే పేరుగల పంతులమ్మ లేనేలేదు ఆ ఊరిలో. ఒకప్పుడు ఉండేదేమోననే శంకతో, స్కూళ్ళన్నీ తిరిగాడు. అటువంటి పేరే వినలేదన్నారు అందరూ.

అతనికి పిచ్చి ఎత్తినట్లయింది.

లేని సుజాతకోసం వెర్రిగా ఊరంతా వెదికాడు. పరుగెత్తాడు వీధులన్నీ. అతని చేతిలోని సుజాత ఫోటో అతన్ని వెక్కిరిస్తూ నవ్వింది. అతని మెదడు ఆలోచించడానికి ఎదురు తిరిగింది.

మర్నాడు విశాఖపట్నం తిరి గొచ్చేశాడు.

సరాసరి రవి గదిలోకి వెళ్ళాడు. సుజాత వ్రాసిన ఉత్తరాలన్నిట్నీ చిందర వందరగా పడేశాడు. చూసిన వాటినే మళ్ళీ మళ్ళీ చూశాడు.

రవి డైరీనితీసి చదివాడు, మహంతి. అందులో తారీఖులవారీగా—'నాకు ఈ తేదీన సుజాత పేరున వ్రాసుకున్న ఉత్తరంలో ఈ విషయాలు వ్రాసుకున్నాను-' అని వ్రాసిఉంది. ఆమె వ్రాసినట్లుగా ఉన్న ఉత్తరాల సారాంశము వ్రాసుకున్నాడు, రవి. కొద్ది రోజుల్లో సుజాత కథను పూర్తి చెయ్యాలనుకున్నాట్ట—అది కూడా వ్రాశాడు. మహంతికి తెలుసును, రవి ఎడమచేత్తో కూడా వ్రాయగలడని.

నేలమీదపడిఉన్న సుజాత ఉత్తరాలు మహంతిని కవ్వించాయి. వాటిని తీసుకుని చూశాడు. అన్నిటిమీద విశాఖపట్నం పోస్టల్ ముద్రే!!!—

ఆనందానికి దూరమైన రవి, కృత్రిమంగా దాన్ని సృష్టించుకుందామని ప్రయత్నించి అమాయకంగా అస్తమించాడు.

మహంతి జుట్టు పీక్కున్నాడు. వెర్రిగా కేకెట్టాడు—

"రవీ" అంటూ.

జీవితంలో మొదటిసారిగా ఏడ్చాడు. వెక్కి వెక్కి ఏడ్చాడు.

నేలమీదకు కూలబడి, పొర్లుతూ ఏడ్చాడు. మరోసారి—

"రవీ" అంటూ అరిచాడు.

ఎక్కడికో పరుగెత్తబోయి, మరుక్షణంలోనే కుర్చీలో కూలబడ్డాడు.

మహంతి మరి కదల్లేదు. ★


మీ అందానికి మంచిదారి



మీ జీవిత విజయాలకు అందం అవసరం. ఎండవేడికి యింకా యితరకారణాలవల్ల ముఖం క్రమేపి నల్లబడి, ముదిరూపువస్తుంది. గ్లోరియా అనే ద్రవముయొక్క అద్భుత సౌందర్య పోషకశక్తి మీ ముఖంలోని అసహ్యమయిన ముదిరూపును పోగొట్టి ఆకర్షణీయమయిన లేతదనాన్ని తెస్తుంది. మీ అందం దినాదినాభివృద్ధి అవడానికి నెలకు అధమం కొన్నిసార్లు అయినా గ్లోరియా అనే సౌందర్య పోషక ద్రవాన్ని వాడండి. ముఖంమీద మొటిమలను వాటి మచ్చలను, ముడతలను, నమ్మకంగా పోగొట్టి ముఖాన్ని తెలుపుచేసి, కాంతిని, అందాన్ని తెచ్చును. మొదటి పూతకే మీకు ఆశ్చర్యాన్ని కలిగించే అందాన్ని యిస్తుంది. ఒకసారి వాడి చూస్తే మీరెప్పుడూ విడువరు. అన్నిషాపులలో దొరకును

జనితా ప్రొడక్ట్సు - ఏలూరు. (ఆంధ్ర)






ధాతుపుష్టికి...... నరముల పటుత్వమునకు

పండిత నోరి రామశాస్త్రులవారి

జీవనవల్లి

ఆయుర్వేద నిలయము, విజయవాడ-1.